డెంగీ నివారణకు చర్యలు

డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట డీసీ మారుతీ దివాకర్ సీడీఆర్ లేన్ బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. దోమల జీవిత చక్రాన్ని తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డా.హేమలత పాల్గొన్నారు.

- అంబర్‌పేట

సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆఫీస్‌లో పలువురు మహిళలు ఎమ్మెల్యేను కలిసి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చా రు.

- మెహిదీపట్నం

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

రఘునాథ్‌నగర్‌లో స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జూలై 9 : అంబర్ పేట డివిజన్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పాదయాత్ర నిర్వహించారు. మంగళవారం రఘునాథ్‌నగర్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలు శాఖల అధికారులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, లోప్రెషర్, కలుషిత నీటి సమస్య, వెలుగని వీధిదీపాల సమస్యలతో పాటు బస్తీలో రహదారుల మరమ్మతులు చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే డ్రైనేజీ సమస్య పరిష్కారంతో పాటు సరిపడా మంచినీటిని సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్‌ముదిరాజ్, జాఫర్ స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభి మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్, జూలై 9: పేదలకు ఉచితంగా వైద్య సేవలందించడానికి ప్రైవేటు ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలు బస్తీల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చిలో ముషీరాబాద్ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చర్చి డైరెక్టర్ శ్యామ్ అబ్రహం, కన్వీనర్ అబ్రహం, బీఆర్ఎస్ యూత్ విభాగం నేత ముఠా జయసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, కేర్ ఆస్పత్రి వైద్యులు అబ్దుల్ నఫీ, మొయినుద్దీన్, సయ్యద్ అబ్దుల్, స్వాతి, ఆనంద్‌బాబు, వరుణ్ పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ అధికారుల వినూత్న ప్రయోగం

ప్రజలు చెత్తవేయకుండా ఉండేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు వినూత్న ప్రయోగం మొదలు పెట్టారు. ఎక్కడైతే చెత్త వేస్తారో అక్కడ శుభ్రంచేసి బస్తీవాసులతో క్యారం ఆడుతున్నారు. సాయంత్రం వరకు పారిశుధ్య కార్మికులు ఆడితే రాత్రి బస్తీవాసులు లైట్లు పెట్టుకొని ఆడాలని చెబుతున్నారు. సర్కిల్ పరిధిలోని అన్ని జీవీ పా యింట్ల వద్ద ఈ ప్రయోగం చేస్తున్నారు. నల్లకుంట డివిజన్ నర్సింహాబస్తీలో మంగళవారం డీసీ మారుతీ దివాకర్, ఏఎంఓహెచ్ డా. హేమలత, కార్పొరేటర్ అమృత బస్తీవాసు లు, పారిశుధ్య కార్మికులతో క్యారం ఆడించారు.

- అంబర్‌పేట

అక్కిరాజు కవితల సంపుటి ఆవిష్కరణ

శ్రీవాగ్దేవి ఆర్ట్స్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో అక్కిరాజు కళాసేవక్ అవార్డుల ప్రదానం, అక్కిరాజు కవితల సంపుటి ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని కవితల సంపుటిని ఆవిష్కరించి, పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో రచయిత ఏనుగు నరసింహారెడ్డి, మురళీధర్, కాంతికృష్ణ, వెంకటరావు, ఎల్పీ రావు, సీహెచ్ త్రినాథరావు, దైవజ్ఞశర్మ, యోగిత అక్కిరాజు, శ్రీవాగ్దేవి ఆర్ట్స్ అధ్యక్షుడు వినయ్‌బాబు పాల్గొన్నారు.

- ముషీరాబాద్

గోల్కొండ కోటపై భక్తుల సందడి

మెహిదీపట్నం, జూలై 9 : గోల్కొండ జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు సందడి చేశారు. సాధారణంగా ఆది, గురువారాల్లోనే పూజలు ఉండగా, మంగళవారం కూడా భక్తులు గోల్కొండకు వచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్, మహేశ్‌కుమార్, ఈవో శ్రీనివాస రాజు చర్యలు తీసుకున్నారు.

బుజిలి మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్‌గా పరమేశ్‌కుమార్

లంగర్‌హౌస్ బుజిలి మహంకాళి ఆలయ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా పరమేశ్‌కుమార్, కన్వీనర్‌గా గురజాల అరవింద్ కుమార్, కోశాధికారిగా కార్‌కొండ మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బస్తీ సంక్షేమ సంఘం నాయకులు ఎన్. స్వామి, ఉదయ్‌కుమార్, ఆరెల్ల కృష్ణాయాదవ్ తదితరుల సమక్షంలో బుజిలి మహంకాళి ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్ బోగె పరమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. లంగర్‌హౌస్ బోనాలను వైభవంగా నిర్వహించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నల్లకుంట డివిజన్ గోల్నాక కూరగాయల మార్కెట్‌లో కె.శ్యామ్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ అమ్మ వారికి పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఇందులో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గరిగంటి రమేశ్ పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు డీఎన్ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

- అంబర్‌పేట

సమాజసేవలో భాగస్వాములు కావాలి

సమాజసేవలో భాగస్వాములు కావాలని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుర్రం శంకర్ చంద్రకళ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్‌కుమార్‌యాదవ్ మహిళలకు చీరెల పంపిణీ, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అరవింద్ యాదవ్, అభిషేక్ కెనెడీ, జననికి సుధాకర్, ఎం. నర్సింగ్‌రావు, గుర్రం గణేశ్, దినేశ్, లావణ్య, సరిత, శ్వేత పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

ప్రజల అభ్యున్నతికి కృషి

ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతున్నదని టీపీసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. సెట్విన్ మాజీ డైరెక్టర్ ఎస్. ధన్‌రాజ్, మేడికొండ కుమార్ .. మున్షీని ఆమె నివాసంలో కలిసి పార్టీలో చేరారు. ఆమె ధన్‌రాజ్‌కు పార్టీ కండువాను వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు, వ్యవసాయ శాఖ మాజీ డైరెక్టర్ టి. సతీశ్ పాల్గొన్నారు.

- అబిడ్స్

దివ్యాంగులకు వైద్య పరీక్షలు

జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ముషీరాబాద్‌లోని మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. 1వ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ సైకియాట్రిస్ట్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి చిన్నారులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. యోగా గురువు సరోజిని, కృష్ణవేణి, జ్యోతి రాజా, డాక్టర్ హిప్నో పద్మ, లయన్ శ్రీనివాస్, సీహెచ్ గోపాలకృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

- ముషీరాబాద్

హకీంపేట్‌లో జూనియర్ కాలేజీ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలంటూ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జూనియర్ కాలేజీ నిర్మాణానికి హకీంపేట్‌లోని ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలన్నారు. దీనికి స్పందించిన మంత్రి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

- మెహిదీపట్నం

మెహిదీపట్నం : గోల్కొండ బీజేఆర్ కాలేజీలో యూబీడీ అధికారులు నిర్వహించిన . వనమహోత్సవంలో భాగంగా మొక్క నాటి నీరు పోస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ డీసీ శశిరేఖ, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్

ధోబీఘాట్లలో ఉచిత కరెంట్ అమలు చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ధోబీ సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ నర్సింహ

చిక్కడపల్లి, జూలై 9 : ధోబీఘాట్లలో ఉచిత కరెంట్ పథకం అమలు చేయాలని తెలంగాణ ధోబీ సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం. నర్సింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడతూ.. రజక కాలనీలు ధోబీఘాట్లలో ఉచిత కరెంట్ అమలు కావడం లేదని, నగరంలోని 26 ఘాట్లల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపించి అమలు చేసే విధంగా ఒత్తిడితేవాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని వారు చెప్పారు. కార్యదర్శి చుక్కన్న, నాయకులు చంద్రమోహన్, కిషన్, సుధాకర్, ఎ.అశోక్, సి.అశోక్, రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగాలు లభించేలా చూడాలి

ప్రొఫెసర్ కోదండరాంను టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పాల్కం శ్రీనివాస్ కలిసి జలమండలిలో రిటైర్డ్ అయిన వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని ఆశించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, పాల్కం వినయ్‌రాజ్, శివకుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

- అబిడ్స్

విద్యార్థి అదృశ్యం

కాచిగూడ, జూలై 9 : డిగ్రీ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఎస్సై పి.రవికుమార్ వివరాల ప్రకారం.. చెప్పల్‌బజార్ రహమత్‌బాగ్‌కు చెందిన జేతిన్ ఆర్ జైన్ డిగ్రీ చదువుతున్నాడు. సోమవారం తెల్లవారు జామున తల్లిదండ్రులు లేవక ముందే వెళ్లిన జేతిన్ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి రాజేశ్‌కుమార్ జైన్ మంగళవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. వెళ్లే సమయంలో జేతిన్ ఆకుపచ్చ చొక్కా, నీలి ట్రాక్ ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.

మరోచోట వృద్ధుడు..

చార్మినార్ : హుస్సేని ఆలం పీఎస్ పరిధిలో వృద్ధుడు అదృశ్య మయ్యాడు. ఎస్సై నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘాన్సీ బజార్‌లో నివసించే భీంరావు బజరంగ్ 1 న కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు హుస్సేఅలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

మాసాబ్ ట్యాంక్‌లో మహిళ ..

మెహిదీపట్నం : ఇంట్లో నుంచి వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన మాసాబ్‌ట్యాంక్ పీస్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్‌బస్తీ అంబేద్కర్‌నగర్‌లో నివసించే వీరమ్మ 5 వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

ద్విచక్రవాహనం ఢీ..

వ్యక్తికి తీవ్ర గాయాలు

కాచిగూడ, జూలై 9 : వాకింగ్‌కు వెళ్తున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ, మౌలానాఆజాద్‌నగర్‌కు చెందిన సుదర్శన్(55)మంగళవారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్తుండగా అదే సమయంలో గుర్తుతెలియని అక్టీవా వెనుక నుంచి ఢీకొనడంతో ఆతడి కుడి కాలు విరిగింది. ద్విచక్రవాహన దారునిపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

జర్మనీలో ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్, జూలై 9 : జర్మనీలో ఉద్యోగాల భర్తీ కోసం బీఎస్సీ, జీఎన్ఎం నర్సుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్. మైత్రిప్రియ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టామ్‌కామ్, ఫెడరల్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ ఆఫ్ జర్మనీ ప్రభుత్వ భాగస్వామ్యంతో జర్మనీ భాషా శిక్షణలో ట్రిపుల్ విన్ ప్రాజెక్ట్ కింద జర్మనీలో నర్సుల ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 9 నుంచి 17 వరకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థుల వయస్సు 21 నుంచి 38 సంవత్సరాల మధ్య ఉండి, తెలంగాణలో గుర్తింపు పొందిన కళాశాల నుంచి నర్సింగ్, ఐసీయూ, జెరియాట్రిక్, ఆర్థోపెడిక్, సైక్రి యాట్రిక్, కార్డియాలజీ , నియోనాటల్, సర్జికల్ వార్డులలో 1 నుంచి 3 సంవత్సరాల ప్రొఫెషనల్, క్లినికల్‌లలో పని చేసిన అనుభవం ఉండాలని అన్నారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులు బీ1 భాషా శిక్షణను భారతదేశంలో పూర్తి చేసిన అనంతరం జర్మనీలో నర్సింగ్ అసిస్టెంట్‌గా పని చేసే అవకాశం ఉంటుందని, జర్మనీలో బీ2 గుర్తింపు పరీక్షను క్లియర్ చేసిన అనంతరం రిజిస్టర్డ్ నర్సుగా పదోన్నతి చేయబడుతారని తెలిపారు. జర్మన్ భాషా శిక్షణ ఉచితమని, ఓవర్‌టైం మినహాయించి 2,300 నుంచి 2,800 యూరోల కనీస వేతనం ఉంటుందని అన్నారు. వీసా, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ, వన్ వే ఫ్లైట్ టిక్కెట్లను టామ్‌కామ్ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు 9908830438/ 891904 7600 / 7032379066/ 849999 0304/ 6302292450 నంబర్లలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. లేదా ఈ నెల 17 వరకు బేగం పేట్‌లోని హోటల్ ది ప్లాజాలోని రెండవ అంతస్తులో నేరుగా తమ దరఖాస్తులను సమర్పించవచ్చని, మరింత సమాచారం కోసం www.tomcom. telangana. gov.in లో, టామ్‌కామ్ మొబైల్ యాప్‌లో సందర్శించాలి.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నాంపల్లి కోర్టులు, జులై 9 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన కొత్త చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలని నాంపల్లి కోర్టులో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో రాష్ట్ర హైకోర్టు అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా బి. నర్సింహశర్మ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)పై ఆయన మాట్లాడుతూ.. చాలా కాలం తర్వాత చట్టాలను సవరించడం జరిగిందని, కొత్త చట్టాలను అలవర్చుకునేందుకు సమయం పడుతుందన్నారు. గత చట్టాలకు ప్రస్తుతం తీసుకువచ్చిన నిబంధనలు, విధి, విధానాల గురించి నెమ రువేసుకోవాలని అన్నారు. అదేవిధంగా నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రచురింపబడిన కొత్త మెజర్ యాక్టు పుస్తకాలను తెలంగాణ హైకోర్టు జడ్జి ఎన్. తుకారాంజీ న్యాయవాదులకు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన న్యాయవాదుల సంక్షేమ నిధి నుంచి ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యకార్డులను సైతం అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్‌తో పాటు సభ్యుల సమక్షంలో శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందించారు.



సోలిసిటర్ జనరల్ బి. నర్సింహశర్మ, జస్టిస్ ఎన్.తుకారాంజీలను సత్కరించిన సభ్యులు

డ్రైవర్స్ వెల్ఫేర్ బోర్డ్‌ను ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, జూలై 9 : డ్రైవర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్స్ వెల్ఫేర్ బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్(సీఐటీయూ) నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రవాణా రంగం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సభను నిర్వహించారు. ఆర్థిక వ్యవస్థను ముందుకు నడపడంలో రవాణా రంగం, డ్రైవర్లు కీలక పాత్ర పోసిస్తున్నారని అన్నారు. డ్రైవర్లపై చలాన్లు, ఫె నాల్టీలు, యూజర్ చార్జీలు వంటివి వేస్తూ ఆర్థిక భారం మో పుతున్నారని తెలిపారు. స్పెషల్ డ్రైవర్స్ పేరుతో డ్రైవర్లని వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐ ఆర్టీ డబ్ల్యూఎఫ్ నగర కార్యదర్శి కె.అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు పి. శ్రీకాంత్, ఎం. వెంకటేశ్, కె. సతీశ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లోని హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హమాలీ యూనియన్ నాయకుడు జహంగీర్ సాగర్ అధ్వర్యంలో మార్కెట్ కమిటీ గ్రేడ్-2 అధికారి శ్రీనివాస్‌ను కలిసి విన్నవించారు. హమాలీ కార్మికులు ప్రతిరోజూ అర్ధరాత్రి మార్కెట్‌కు చేరుకుంటారని అయితే వారికి కూర్చునేందుకు, పడుకునేందుకుగాని సరైన వసతి లేదని అన్నారు. మార్కెట్‌లో దోమల బెడద తీవ్రంగా ఉందని, కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శివం, అశోక్, గంగులు, సునీల్, అలీం, సంతోష్ పాల్గొన్నారు.

– కార్వాన్

సీఐ జితేందర్‌రెడ్డిని అరెస్టు చేయాలి

● దళిత, ప్రజా సంఘాల డిమాండ్

చిక్కడపల్లి, జూలై 9 : దళిత ఎస్సై శ్రీరాములు శ్రీనివాస్ ఆత్మహ్యతకు కారకుడైన ఆశ్వారావుపేట సీఐ జీతేందర్‌రెడ్డితో పాటు నలుగురు కానిస్టేబుళ్లపై హత్యానేరం కేసు నమోదు చేయాలని పలు దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళిత బహుజన ఫ్రంట్, కేవీపీఎస్, ఎన్‌పీఎంఫ్‌ల ఆధ్వర్యంలో దళిత ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యకు కారుకులైన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌంట్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ పాల్గొన్నారు.

కత్తితో దాడి ముగ్గురి రిమాండ్

కార్వాన్, జూలై 9 : యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన గుడిమల్కాపూర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ భైరి రాజు తెలిపిన ప్రకారం.. హీరానగర్‌లో ఉండే నరేశ్ ఫైనాన్స్ వ్యాపారి. అశోక్‌కు కొంత అప్పు ఇ చ్చాడు. తిరిగి చెల్లించక పోవడంతో తరచూ అశోక్‌ను అడుగుండడంతో మాట్లాడుకుందామని లక్ష్మీనగర్‌లోని వీ5 బార్ వద్దకు పిలిపించాడు. నరేశ్ తన మిత్రుడు మిన్నితో కలిసి వెళ్లగా అశోక్ తన మిత్రులైన రాజేశ్, హరీశ్‌లతో కలిసి వెళ్లి మద్యం సేవించారు. అనంతరం నరేశ్ డబ్బులు అడుగగా అశోక్ మిత్రుడు రాజేశ్ కత్తితో నరేశ్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించగా మిన్ని అడ్డుపడడంతో అతడి చేతికి గాయమైంది. నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అశోక్, రాజేశ్, హరీశ్‌ను రిమాండ్‌కు తరలించారు.

ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి

చిక్కడపల్లి : జీఓ నం. 317 ప్రకారంగా వ్యవసాయ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ కోరారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేణుగోపాలరావును కలిసి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వైద్యనాథ్ మాట్లాడుతూ.. అధికారులకు వాహన సౌకర్యం, హెల్త్ కార్డులు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాపార వేత్తకు బెదిరింపులు - నిందితుల అరెస్ట్

చార్మినార్, జూలై 9: వ్యాపారిని బెదిరించి బంగారం ఎత్తుకెళ్లిన నిందితులను దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్, హుస్సేనీ అలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన షేక్‌రోస్టిక్ , షేక్ హసిజుల్ కొంత కాలం కిందట నగరానికి వచ్చి ఘాన్సీబజార్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. స్థానికంగా ఉన్న బంగారు నగలు తయారు చేసే దుకాణాల్లో పనులు చేస్తున్నారు. షేక్ రోస్టిక్, షేక్ హసిజుల్ అధిక సంపాదన కోసం పశ్చిమ బెంగాల్‌కు చెందిన బాపి, మాణిక్, కార్తీక్‌తో కలిసి బంగారు వ్యాపారస్తులను లక్ష్యంగా చేసుకుని దోపిడీ లకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఓ బంగారు నగలు దుకాణంలోకి చొరబడి ఆభరణాలు, నగదు ఇవ్వాలని బెదిరించగా వ్యాపారి 56 గ్రాముల బంగారు నగలతోపాటు రూ.90వేలను నిందితులకు అప్పగించి, హుస్సేనీ ఆలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం నిందితులు ఘాన్సీబజార్‌లో సంచరిస్తుండగా దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాపి, మాణిక్, కార్తీక్ పారిపోయారని తెలిపారు. నిందితుల వద్ద నుంచి బంగారు నగలతో పాటు రూ.90 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను హుస్సేనీ ఆలం పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.